


ప్రభాత
PRABHATA SURYA
# సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
11-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 242

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించండి..

# మెట్రోలో వెళ్లండి: ప్రధాని మోదీ

2లో

### వచ్చే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలుస్తాం

- సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- పశ్చిమ బెంగాల్ గాలి ఇక్కడ కూడా బలంగా వీస్తోంది
- అఖండ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు
- విభజన రాజకీయ శక్తులకు అడ్డా కాంగ్రెస్...
- కాంగ్రెస్‌ను 'ముస్లిం లీగ్ మావోయిస్టు
- కాంగ్రెస్ (ఎంఎంసీ)'గా అభివర్ణించిన మోదీ

హైదరాబాద్: యుద్ధాలతో ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం, ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయని.. భారత్‌పైనా తీవ్ర ప్రభావం పడుతోందని.. ఈ తరుణంలో దేశం కోసం మనందరం కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు! పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని.. మెట్రో రైలు సౌకర్యం ఉన్న నగరాల్లో ప్రజలుదాన్ని వినియోగించుకోవాలని.. కారులో వెళ్లాల్సి వస్తే కార్ పూల్ చేసి ఇతరులనూ తీసుకెళ్లాలని సూచించారు. ఏడాదిపాటు ఎవరూ బంగారం కొనొద్దని.. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని హితవు పలికారు. వస్తు రవాణా కోసం రైలు సేవలు వినియోగించుకోవాలన్నారు. రైళ్లు కరెంటుతో నడుస్తాయి కాబట్టి వాటికి పెట్రోల్, డీజిల్ అవసరం ఉండదని గుర్తుచేశారు.

# సంపూర్ణంగా సహకరిస్తాం

- అభివృద్ధే లక్ష్యంగా కలిసి పనిచేద్దాం: ప్రధాని మోదీ
- తెలంగాణ రైజింగ్‌ను వికసిత్ భారత్‌లో భాగం చేద్దాం
- అభివృద్ధి విషయంలో రాజకీయాలకు చోటు లేదు
- హెచ్‌ఐసీసీలో రూ.9,400 కోట్ల పనుల ప్రారంభం



## ఇక బరువు తగ్గొద్దు లోకేశ్..

- ప్రధాని మోదీ సరదా సూచన!
- హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ప్రధాని మోదీకి తేనీటి విందు
- ఫిట్‌నెస్ విషయంలో మోదీయే తనకు స్ఫూర్తి అన్న లోకేశ్
- మోదీ, చంద్రబాబు ఇద్దరూ తనకు మెంటార్లేనని వెల్లడి
- రాష్ట్రానికి అందిస్తున్న సాయానికి మోదీకి కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు




2లో

# తమిళ సీఎంగా విజయ్ ప్రమాణం

- చెన్నైలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం
- మంత్రులుగా తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం
- వాగ్దానాల అమలుకు వేదికపైనే విజయ్ శ్రీకారం
- ఉచిత విద్యుత్, మహిళల భద్రత, డ్రగ్స్ కట్టడిపై మూడు సంతకాలు
- పాలనలో నూతన శకం మొదలైందని ప్రకటన
- ప్రజల రుణం తీర్చుకోవడానికొచ్చా.. ప్రజాధనం ముట్టుకోబోనని ప్రతిన
- రాష్ట్రంలో శాంతి భద్రతలపై సీఎం హోదాలో తొలి సమీక్ష
- ప్రొటెం స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే కరుప్పయ్య ప్రమాణం
- నేడు నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

2లో

## ఆ మూడు ఫైళ్లపై విజయ్ సంతకం!

- ఇకనుంచి తమిళనాడులో 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం
- మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ రెండో సంతకం
- డ్రగ్స్ నియంత్రణ పై మూడో సంతకం

తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. తాను హామీ ఇచ్చిన మాదిరిగా మూడు ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేశారు. అందులో ప్రధానమైనది 200 యూనిట్ల వరకు

# ఇంటర్ అడ్మిషన్లు పాత పద్ధతిలోనే..

- పాఠశాల విద్యలో ఇంటర్‌బోర్డు విలీనంపై నిర్ణయం వాయిదా
- సమయం లేకపోవడం.. సంస్కరణలకు మరింత సమయం అవసరం
- దీంతో ఈ ఏడాది పాత పద్ధతిలోనే అడ్మిషన్లు చేపట్టాలని సీఎం నిర్ణయం
- పాఠశాల విద్యాశాఖ అధికారుల సమీక్షలో రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ



## అమెరికా ప్రతిపాదనలపై

# చర్చకు ఓకే

### ఇరాన్ అంగీకారం

#### డ్రోన్ దాడితో ఖతార్ జలాల్లో నౌకకు నిప్పు


దుబాయ్/ఇస్లామాబాద్: అమెరికా అందజేసిన 14 సూత్రాల ప్రతిపాదనపై చర్చలకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం పాకిస్తాన్‌కు ప్రతినిధులను పంపించేందుకు అంగీకరించింది. ఈ మేరకు మధ్యవర్తిగా ఉన్న పాక్‌కు సమాచారం పంపినట్లు ఇరాన్ అధికార వార్తా సంస్థ వెల్లడించింది. అయితే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

2లో

## ఖజానా ఖాళీ" అని అప్పుడే సాకులు చెప్పొద్దు... విజయ్‌కు స్టాలిన్ చురకలు!

- తమిళనాడు నూతన సీఎం విజయ్‌కు మాజీ సీఎం స్టాలిన్ అభినందనలు
- రూ.10 లక్షల కోట్ల అప్పు ఆరోపణలను ఖండించిన స్టాలిన్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే విజయ్ హామీలు ఇచ్చారని విమర్శ
- త్వరలోనే పాలనలోని సూక్ష్మాలను నేర్చుకుంటారని ఆశిస్తున్నట్లు వ్యాఖ్య

## రేపట్నుంచి పెరగనున్న ఉష్ణోగ్రతలు



# తమిళ సీఎంగా విజయ్ ప్రమాణం

చెన్నై: తమిళనాడులో ద్రవిడ పార్టీల పరిపాలనా పర్వానికి తెరదించుతూ తమిళగ వెట్రి కళగం(టీవీకే) చీఫ్ సి.జోసెఫ్ విజయ్ ఆదివారం నూతన ప్రభుత్వాన్ని కొలువుతీర్చారు. ఆత్మీయులు, కుటుంబసభ్యులు, వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గత 60 ఏళ్ల తమిళనాడు చరిత్రలో డీఎంకే, అన్నాడీఎంకే ప్రమేయం లేని ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఉదయం 10.15 గంటలకు అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం ఆరంభమైంది. విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేయించారు. టీవీకేలోని 9 మంది నేతలు మంత్రులుగా ప్రమాణంచేశారు. టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ సైతం భాగస్వామిగా చేరిన నేపథ్యంలో ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేకంగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి విజయ్ తల్లిదండ్రులు ఎస్.ఎ.చంద్రశేఖర్, శోభ, తమిళనాడులో బీజేపీ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, సినీ నటి త్రిష, వామపక్ష పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలు ముందువరసలో కూర్చుని ప్రమాణస్వీకారాన్ని చూశారు. పలువురు ప్రముఖులు, తమిళ సినీతారలు, టీవీకే నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అభిమానుల 'విజిల్' మోతలు, 'సీఎం విజయ్', 'దళపతి' నినాదాలతో ఇండోర్ స్టేడియం మార్మోగిపోయింది. విజయ్ తన మంత్రివర్గంలో యువత, అనుభవజ్ఞులకు ప్రాధాన్యమిచ్చారు. సీఎంగా ప్రమాణంచేశాక విజయ్ ఉద్వేగంగా ప్రసంగించారు. నిజమైన లౌకికవాదం, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండే పాలనకు సంబంధించిన నూతన శకం ఇప్పుడే ప్రారంభమైందని స్పష్టంచేశారు. విజయ్‌తో సీఎంగా ప్రమాణం చేయించేందుకు ఆయనను పోడియం వద్దకు గవర్నర్ ఆహ్వానించారు. 'నేను' అని గవర్నర్ అందివ్వగా అధికారికంగా ఇచ్చిన ప్రమాణపత్రాన్ని కాదని సొంతంగా తనదైన శైలిలో ప్రమాణంచేసేందుకు విజయ్ ప్రయ తీ?నంచారు. వెంటనే గమనించిన గవర్నర్ సున్నితంగా అడ్డుకుని రాజ్యాంగంలో పేర్కొన్న శైలిలోనే ప్రమాణం చేయాలని సూచించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో గాయకులు వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను ఆలపించడం విశేషం. సాధారణంగా అధికారిక కార్యక్రమంలో మొదటి రెండు చరణాలను ఆలపిస్తారు. అయితే, మొత్తం ఆరు చరణాలను ఆలపించాలంటూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ప్రమాణ స్వీకార వేడుకలో తమిళ తల్లి గీతం.. తమిళ్ తాయ్ వాళ్తుకు మూడో స్థానం కల్పించడాన్ని సీపీఐ, డీఎంకేలు తీవ్రంగా పరిగణించాయి. వందేమాతరం, జనగణమన అనంతరం తమిళ్ తాయ్ వాళ్తు గీతాన్ని ఆలపించారు. ప్రాధాన్యతా క్రమంలో తమిళ గీతానికి మూడోస్థానం కల్పించడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీర పాండియన్, వీసీకే అధినేత థోల్ తిరుమావళవన్‌తోపాటు సీపీఎం, ఐయూఎంఎల్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.

# పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించండి..
# మెట్రోలో వెళ్లండి: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ యుద్ధం మొదలయ్యాక ప్రధాని మోదీ ఇంధనం, ఎరువుల కొరతతోపాటు యుద్ధం వల్ల కలుగుతున్న పలు సమస్యలపై బహిరంగంగా ప్రస్తావించి, ప్రజలకు జాగ్రత్తలు చెప్పడం ఇదే తొలిసారి. రాష్ట్రపర్యటనలో ఉన్న ఆయన.. ఆదివారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తూ ఈ జాగ్రత్తలు చెప్పారు. "నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా.. మీ అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు" అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ.. రాజకీయ విమర్శలు చేయడంతోపాటు, దేశ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు.రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని అఖండ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నాక తెలంగాణలోనూ ఆ గెలుపు ప్రకంపనలు కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ విశ్వాసఘాతుకం, హామీల అమల్లో వైఫల్యం, కుటుంబ రాజకీయాల పట్ల విసిగిపోయిన తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా... మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలంగాణలో బీజేపీవైపు గాలిమార్పు స్పష్టంగా గోచరిస్తోందన్నారు. 'అబ్‌కీ బార్ తెలంగాణ' (ఇక్కడ కూడా బీజేపీ ప్రభుత్వం) అంటూ సభికులతో మోదీ నినాదాలు చేయించారు. దశాబ్దాల కింద బీజేపీకి ఎన్నో రాష్ట్రాల్లో ఆదరణ లభించలేదని, అయితే దేశవ్యాప్తంగా బీజేపీకి రెండుసీట్లు ఉన్నప్పుడు ఒకటి తెలంగాణలో వచ్చిందని గుర్తుచేశారు. ఆ విధంగా బీజేపీ చరిత్రలో తెలంగాణకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. ఇప్పుడు దేశం నలుమూలలా బీజేపీపై ప్రజల ఆశీర్వాదం పెరుగుతోందని, బీజేపీ గుడ్‌గవర్నెన్స్ మోడల్‌పై ఎన్నికల్లో ప్రజలు ఓటు ముద్రవేశారన్నారు. తెలంగాణ అలాంటి ప్రదేశమైనందున ఇప్పుడు 8 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలున్నారని, ఇక అధికారానికి రావడమే తరువాయి అని చెప్పారు.

**బీజేపీ అభివృద్ధి మోడల్‌పై విశ్వాసం**

దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీ అభివృద్ధి మోడల్, సుపరిపాలనపై మళ్లీ మళ్లీ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని మోదీ చెప్పారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించిందని, పుదుచ్చేరిలో కూడా ఎన్డీఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణ ప్రజలు కూడా అదే విషయం స్పష్టంగా చెబుతున్నారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం కేవలం రాజకీయ గెలుపు మాత్రమే కాదని, ప్రజలను ఏళ్ల పాటు బంధించిన కుటుంబ, నియంతృత్వ రాజకీయాలపై ప్రజలు ఇచ్చిన తీర్పు అని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అవినీతి, కుటుంబవాదం, రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచే రాజకీయాలకు మారుపేరుగా మారిందని ధ్వజమెత్తారు. అదే మార్గంలో తృణమూల్ కాంగ్రెస్ కూడా నడిచిందని, ఇప్పుడు ప్రజలు అలాంటి రాజకీయాలను తిరస్కరిస్తున్నారని అన్నారు. అయితే బెంగాల్‌లో బీజేపీ విజయంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, అక్కడ రాజకీయ పార్టీల ఓటమి జరగలేదని, ఒక రాజకీయ నీతి పరాజయం పాలైందని మోదీ చెప్పారు.

# ఇంటర్ అడ్మిషన్లు పాత పద్ధతిలోనే..

హైదరాబాద్: ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు 2026--27 విద్యా సంవత్సరానికి పాత పద్ధతిలోనే చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉందని, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సీబీఎస్ఈలో తరహాలో 11, 12 తరగతులను పాఠశాల విద్యలోనే కొనసాగించాలని, ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అక్కడితోనే చదుకు ఆపేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ కూడా తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. జూనియర్ కాలేజీల యాజమాన్యాలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో సీఎం, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి.వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణాలతో ఆదివారం సమీక్షించారు. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం తాజా ఆదేశాలతో అతి త్వరలో ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసే అవకాశం ఉంది.

## ఆ మూడుఫైళ్లపై విజయ్ సంతకం!

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత విద్యుత్, ఇంకొకటి మహిళల రక్షణ కోసం సింగ పెన్ ప్రత్యేక దళం, మరొకటి రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన చర్యలకు సంబంధించిన ఫైల్. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ మూడు ఫైళ్లపై సంతకం చేశారు విజయ్.

- తమిళనాడులో ప్రస్తుతం గృహ అవసరాలకు మొదటి 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. అయితే తాను అధికారంలోకి వస్తే ఆ పరిమితిని 200 యూనిట్లకు పెంచుతానని విజయ్ హామీ ఇచ్చారు. అందుకే తన తొలి సంతకంగా ఆ ఫైల్ పై సంతకం చేశారు. తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధాన హామీని మొదటి రోజే అమలు చేశారు. రెండు నెలలకు 500 యూనిట్ల వరకు విద్యుత్తును వినియోగించే గృహ వినియోగదారులకు.. రెండు నెలలకు కలిపి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుంది.
- ఇక రెండో హామీగా మహిళల భద్రతకు సంబంధించిన ప్రత్యేక రక్షణ దళం ఫైల్ పై కూడా సంతకం చేశారు. సింగపెన్ ప్రత్యేక టాస్కోర్సును ఏర్పాటు చేస్తూ అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేశారు.
- ఇక రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు విజయ్. ఆ హామీకి సంబంధించిన ఫైల్ పై మూడో సంతకం చేశారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తమిళనాడు ను తీర్చిదిద్దడమే లక్ష్యం అని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ క్లబ్బుల ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు విజయ్. అందుకే ఇప్పుడు మాదకద్రవ్యాల నిరోధక విభాగాలను ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశించారు.

## రేపట్నుంచి పెరగనున్న ఉష్ణోగ్రతలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో వారం రోజులుగా సాధారణం, అంతకంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. మంగళవారం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. ఆదివారం రాష్ట్రంలో చాలాచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదు కాగా.. మంగళవారం నుంచి క్రమంగా పెరిగి సాధారణం కంటే 2 నుంచి 4డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ సూచించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని వివరించింది. ఈ వారాంతం వరకు ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయని తెలిపింది. ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 41.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 22.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. సోమవారం ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది.

# సంపూర్ణంగా సహకరిస్తాం

హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాష్ట్ర అభ్యున్నతికి అవసరమైన ప్రాజెక్టులు, నిధుల విషయంలో కేంద్రం ఎలాంటి వివక్ష చూపదని హామీ ఇచ్చారు. తెలంగాణ వికసిస్తేనే దేశం వికసిస్తుందనే నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన మోదీ.. హెచ్ఐసీసీ వేదికగా రూ.9,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తెలంగాణను దేశ ఆర్థిక వృద్ధికి కీలక శక్తిగా అభివర్ణించిన ఆయన ఇవి కేవలం ప్రాజెక్టులు కాదు.. తెలంగాణ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు అని పేర్కొన్నారు. అంతకు ముందు నిధుల కేటాయింపు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ప్రధాని ఛలోక్తులు విసిరారు. 'సీఎం రేవంత్ రెడ్డి గారూ.. ఇది వింటున్నారా?' అంటూ తెలంగాణకు కేంద్రం ఇస్తున్న భరోసాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను మోదీ గుర్తు చేశారు. 'పదేళ్లుగా గుజరాత్‌కే ఎక్కువ నిధులు ఇచ్చారని అంటున్నారు. కేంద్రం పదేళ్లలో గుజరాత్‌కు ఎంత ఇచ్చిందో రేవంత్‌రెడ్డి చెప్పాలి. ఆ రాష్ట్రంతో సమానంగా తెలంగాణకు నిధులు ఇచ్చేందుకు సిద్ధం. గుజరాత్‌తో సమానంగా నిధులిస్తే ఇప్పుడు వచ్చే దాంట్లో మీకు సగమే వస్తాయి. అన్ని రాష్ట్రాలను కేంద్రం ఐక్యంగా ముందుకు తీసుకెళ్తోంది. తెలంగాణ ప్రజల కలలు నెరవేర్చేందుకు కట్టుబడి ఉంది'అని మోదీ అన్నారు. అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని ముఖ్యమంత్రికి సూచించారు. మౌలిక సదుపాయాలు, హైవేల అభివృద్ధి కోసం కేంద్రం లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, దీనివల్ల తెలంగాణకు భారీ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. 'నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం నుంచి సహకారం లభించింది. ఇప్పుడు అదే భావనతో తెలంగాణకు కూడా సహకరిస్తున్నాం. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు స్థానం ఉండకూడదు'అని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్‌ను వికసిత్ భారత్‌లో భాగం చేద్దామంటూ పిలుపునిచ్చారు.

# ఇక బరువు తగ్గొద్దు లోకేశ్..

"ఇకపై బరువు తగ్గవద్దు లోకేశ్, ఇప్పటికే చాలా స్లిమ్‌గా ఉన్నావు" అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు సరదాగా సలహా ఇచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన తేనీటి విందులో ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. లోకేశ్ ఫిట్‌నెస్‌పై చర్చ వచ్చినప్పుడు, ఆయన ఇలా స్లిమ్‌గా, ఫిట్‌గా మారడానికి ప్రధాని మోదీనే కారణమని చంద్రబాబు తెలిపారు. తొలిసారి ప్రధానితో భేటీ అయిన తర్వాతే లోకేశ్ తన డైట్, ఫిట్‌నెస్‌పై పూర్తిస్థాయిలో శ్రద్ధ పెట్టారని మోదీకి వివరించారు. దీనికి స్పందించిన ప్రధాని, లోకేశ్‌ను అభినందిస్తూనే, ఇక బరువు తగ్గవద్దని సూచించారు.ఈ సంభాషణపై లోకేశ్ స్పందిస్తూ, ఫిట్‌నెస్ విషయంలో తనకు ప్రధాని మోదీయే స్ఫూర్తి అని అన్నారు. "దేశం కోసం క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నా, 75 ఏళ్ల వయస్సులో మీరు పాటించే ఆరోగ్య సూత్రాలు, శారీరక దృఢత్వం నాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి. మీ పని విధానం చూస్తుంటే 25 ఏళ్ల వయసున్న ముగ్గురు యువకులు మీలో ఉన్నట్లు చురుగ్గా పనిచేస్తారు. మీ స్ఫూర్తితో మరింత ఫిట్‌గా మారతాను" అని లోకేశ్ ప్రధానితో చెప్పారు. ఈ సమావేశం సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, ప్రధాని అందిస్తున్న సాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

**సరదా సంభాషణలతో సాగిన భేటీ**

గంటకు పైగా సాగిన ఈ సమావేశం ఆద్యంతం సరదా సంభాషణలతో, నవ్వులతో సాగింది. చంద్రబాబు నివాసంలోకి అడుగుపెడుతూనే, సరిగ్గా ఏడాది క్రితం ఢిల్లీలో తన చేతుల మీదుగా ఆవిష్కరించిన 'యువగళం' కాఫీ టేబుల్ బుక్ ఫొటో ఫ్రేమ్‌ను చూసి ప్రధాని మోదీ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చంద్రబాబు ఇంటిలోని రామ మందిరంలో ప్రధాని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడున్న పంచలోహ సీతారాముల విగ్రహాలను దివంగత ఎన్టీ రామారావు తమకు బహూకరించారని చంద్రబాబు ప్రధానికి వివరించారు. ఈ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరూ తనకు గురువులు, మెంటార్లని అన్నారు.

## ఖజానా ఖాళీ'' అని అప్పుడే సాకులు చెప్పొద్దు... విజయ్‌కు స్టాలిన్ చురకలు!

తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూనే, తీవ్రమైన రాజకీయ విమర్శలతో కూడిన హెచ్చరికలు జారీ చేశారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మీరు సంతకం చేసిన ఉత్తర్వులను కూడా నేను స్వాగతిస్తున్నాను. అయితే, వస్తూనే ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని మాట్లాడటం మొదలుపెట్టవద్దు. అవన్నీ ఉన్నాయి. ప్రజలకు ఇవ్వాలన్న మనసు, పరిపాలనా దక్షత మాత్రమే కావాలి. గత ఐదేళ్లలో మేము కోవిడ్, వరదలు వంటి ఎన్నో సమస్యలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్షను ఎదుర్కొని లెక్కలేనన్ని ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశాం.'గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు చేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయింది' అని మీ మొదటి ప్రసంగంలోనే ఆరోపించారు కదా. తమిళనాడు అప్పులు అనుమతించిన పరిధిలోనే ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి గత ఫిబ్రవరి బడ్జెట్‌లోనే మేము స్పష్టంగా చెప్పాం. ఆ విషయం మీకు తెలియదా? ఆ తర్వాతే కదా మీరు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది? మీకు ఓటు వేసిన ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించి మోసం చేయకండి.

## అమెరికా ప్రతిపాదనలపై చర్చకు ఓకే

సహా అన్ని యుద్ధాలను నిలిపివేయాలని, నౌకాయానం భద్రతకు భరోసా ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ముందుగా వీటిపైనే చర్చలు జరగాలని స్పష్టం చేసింది. ఇవి కార్యరూపం దాల్చాకే హార్మూజ్‌ను తిరిగి తెరవడం, అణుకార్యక్రమాన్ని వదులుకోవడంపై వంటి వాటిపై చర్చలు జరపాలని ప్రభుత్వం పేర్కొందని ఇరాన్ టీవీ తెలిపింది. ఈ షరతులపై అమెరికా స్పందించాల్సి ఉంది. మరోవైపు ఇరాన్--అమెరికాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఆటంకాలు కొనసాగుతున్నాయి. తాజాగా గుర్తు తెలియని ప్రాంతం నుంచి దూసుకొచ్చిన డ్రోన్ల దాడులతో ఖతార్ తీరంలోని ఓ సరుకు నౌకకు నిప్పంటుకోగా, కొన్ని డ్రోన్లు కువైట్ గగనతలంలోకి చొరబడ్డాయి. ఆదివారం ఉదయం అబుధాబి నుంచి వస్తున్న వాణిజ్య నౌకపై జరిగిన డ్రోన్ దాడి ఫలితంగా చెలరేగిన మంటలను వెంటనే ఆర్పేశామని ఖతార్ తెలిపింది.

# మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలి



**మర్రిగూడ మే 10 ప్రభాత సూర్య :** మర్రిగూడ మండలం చౌరస్తాలో మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ బిచ్చు నాయక్, మారగొని సుధీర్ కుమార్ మరియు వట్టిపల్లి గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ రామావత్ ధర్మనాయక్ ఆధ్వర్యంలో భారీ ప్రజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, వివిధ రాజకీయ మరియు సామాజిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం మర్రిగూడ మండలం నల్గొండ జిల్లాలో ఉన్నప్పటికీ జిల్లా కేంద్రానికి ప్రజలు వెళ్లాలంటే చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయాలు, ప్రభుత్వ శాఖల కార్యాలయాలు మరియు ఇతర పరిపాలనా అవసరాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రం మర్రిగూడ ప్రజలకు చాలా దూరంగా ఉండటం వల్ల సమయం మరియు డబ్బు రెండూ వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. అయితే రంగారెడ్డి జిల్లా మాత్రం మర్రిగూడ మండలానికి భౌగోళికంగా చాలా దగ్గరగా ఉందని, ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని నాయకులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం సహా అనేక ప్రభుత్వ కార్యాలయాలు మర్రిగూడ ప్రజలకు సులభంగా చేరుకునే దూరంలో ఉంటాయని అన్నారు. దీంతో ప్రజలకు పరిపాలనా సేవలు త్వరగా అందే అవకాశం ఉంటుందని, ప్రభుత్వ పనులు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేస్తే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలలో ఒకటిగా నిలిచిందని, అక్కడికి పెద్ద ఎత్తున పారిశ్రామిక సంస్థలు, ఫ్యాక్టరీలు, ఐటీ కంపెనీలు మరియు రియల్ ఎస్టేట్ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. మర్రిగూడ మండలం కూడా రంగారెడ్డి జిల్లాలో కలిస్తే ఇక్కడి భూముల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని, రైతులు మరియు భూమి యజమానులకు ఆర్థికంగా లాభం కలుగుతుందని పేర్కొన్నారు. ఇక పరిశ్రమలు మరియు కంపెనీలు స్థాపించబడితే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగాల కోసం హైదరాబాద్ మరియు ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, కానీ రంగారెడ్డి జిల్లాలో విలీనం జరిగితే స్థానికంగానే పరిశ్రమలు ఏర్పడి వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. పరిశ్రమలతో పాటు చిన్న వ్యాపారాలు, ట్రాన్స్‌పోర్ట్, హోటల్ రంగం, నిర్మాణ రంగం కూడా అభివృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అదనంగా రోడ్లు, విద్యుత్, తాగునీరు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు మరియు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని తెలిపారు. మర్రిగూడ మండల ప్రజల భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయడం అత్యవసరమని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసే అంశంపై త్వరలోనే ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, మేధావులు మరియు యువ నాయకులతో కలిసి ఒక భారీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ సమావేశంలో మర్రిగూడ మండల భవిష్యత్ అభివృద్ధి, ప్రజల సమస్యలు మరియు ప్రభుత్వంపై తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు "మర్రిగూడను రంగారెడ్డిలో కలపాలి", "మా మండలానికి అభివృద్ధి కావాలి", "యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి" అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి తమ డిమాండ్‌ను బలంగా వినిపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# పటాన్‌చెరులో ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీ కార్యాలయం ప్రారంభం...

**పటాన్‌చెరు రామచంద్రపురం అమీన్‌పూర్  జిన్నారం మండలాలకు ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీగా హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం నియామకం**

**ఖ్వాజీ ఆఫీసులు మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో ప్రాంతీయ వక్ఫ్ బోర్డుల ఆమోదంతో పనిచేస్తాయి**

**ముస్లిం వివాహాల రిజిస్ట్రేషన్ చట్టపరంగా నాయబ్ ఖ్వాజీ హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం ద్వారా చేయించుకోవాలి**

**అధ్యక్ష ఖ్వాజీ హాజీ సయ్యద్ లతీఫ్ అలీ ఖాద్రి అధికార ప్రకటన**

**పటాన్చెరు, మే 10,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో తెలంగాణ ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీ కార్యాలయం అధ్యక్ష ఖ్వాజీ హాజీ సయ్యద్ లతీఫ్ అలీ ఖాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించిన నాలుగు మండలాల ముస్లిం వివాహాల రిజిస్ట్రేషన్ నాయబ్ ఖ్వాజీ హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం ను సంప్రదించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవాలని తెలిపారు. ముస్లిం వివాహం నిఖా జరిగిన తర్వాత, ఆ వివాహాన్ని రిజిస్టర్ చేయడం చట్టపరంగా ముఖ్యమని తెలిపారు. దీనికోసం ఖాజీ కార్యాలయంలో నిఖా నామా నమోదు చేస్తారని తెలిపారు. వధూవరులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, ఆహ్వాన పత్రికను సమర్పించి తమ వివాహాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. ఖ్వాజీ జారీ చేసిన నిఖా నామా భారత చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే సాక్ష్యంగా పరిగణించబడుతుందని తెలిపారు. క్వాజీ కార్యాలయాలు మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో, ప్రాంతీయ వక్ఫ్ బోర్డు ఆమోదంతో పనిచేస్తాయని, వివాహాలు ధార్మిక కార్యకలాపాల కోసం ఇది ఏర్పాటు చేయబడతాయని, ఖ్వాజీ కార్యాలయ అధికారిక గుర్తింపు కోసం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వెబ్ సైట్ ను సంప్రదించడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సయ్యద్ జహీర్, ఇమామ్ సహాబ్ జామ మస్జిద్ బిహెచ్ఇఎల్ మొహమ్మద్ అబ్దుల్ సత్తార్, డాక్టర్ ఫహీం, ఇస్మాయిల్, జావిద్ హుస్సేన్, ముజీబుర్ రహ్మాన్, సలీం ఖాన్, ముస్తఫా, అన్సార్, సమీర్, యూసుఫ్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.





## అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు...

మాదాపూర్ ప్రభాత సూర్య : శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం రాజశ్యామల డాన్స్ అకాడమీ నాట్య గురువులు శ్రీ లీల కృష్ణ రెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన లో వినాయక కౌతం, శ్రీ విఘ్న రాజాం భజే, దుర్గ తరంగం, అయిగిరినందిని, వన్దే వసుదేవం, బాలకనకమయ, అన్నమాచార్య కీర్తనలు, శ్రీనివాస కళ్యాణం, ప్రహ్లాద పట్టాభిషేకం మొదలైన అంశాలనుం హారిక, హర్షిత, జ్యోస్నా, రితిక, సాహితి, హర్షిత,ముక్త, శరణ్య, చైత్ర సాయి పూజిత, సౌజన్య , ఈక్షిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## ఛలో పరేడ్ గ్రౌండ్స్ గట్టుప్పల్ నుండి బయలుదేరిన జనప్రభంజనం ప్రధాని నరేంద్ర మోదీ సభకు

గట్టుపల్ ప్రభాత సూర్య మే10:సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు గట్టుప్పల్ మండల బీజేపీ కార్యకర్తలు ఉత్సాహంతో బయలుదేరారు.మన దేశ ప్రగతి రథసారథికి అఖండ స్వాగతం పలికేందుకు, తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసే రూ. 9,400 కోట్ల ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో భాగస్వాములు అయ్యేందుకు కదలివస్తున్న ప్రతి కార్యకర్తకూ మనస్ఫూర్తిగా అభినందనలు.సందేశం:"దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం!"అభివృద్ధి ధ్యేయంగా, ప్రజా సేవే పరమావధిగా సాగుతున్న మన ప్రధాని నాయకత్వాన్ని బలపరుద్దాం. గట్టుప్పల్ మండలం గడ్డపై నుండి కమలదళం గర్జించేలా ఈ సభను దిగ్విజయం చేద్దాం ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడురావుల ఎల్లప్ప, చిలువేరు దుర్గయ్య.నాగులగాని శ్రీనివాస్, ఈడం రాజు, జంపాల సుధాకర్, మాదగాని బిక్షం,వీరమల్ల రాజు, మాదుగుల నవీన్, కట్ట యాదగిరి, కంఠాల బ్రహ్మయ్య.






## కుక్కడం గ్రామంలో అయాఆంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 10)ప్రతినిధి :** మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల ల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఆంజనేయ స్వామి భక్తులకు బుద్ధి, బలం, ధైర్యం ప్రసాదించే దైవమని కొనియాడారు. భక్తి, సేవాభావంతో నిర్మించిన ఈ ఆలయం ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు... విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను, గ్రామ ప్రజలను, దాతలను ఎమ్మెల్యే అభినందించారు...ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, వేద పండితులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బిల్ ర్ బ్రదర్స్ పాల్గొన్నారు...



# విద్యుతాఘాతానికి 2పాడి గేదెలు మృతి

**విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణం.. రైతు సంఘం నేతలు**

**మిర్యాలగూడ, మే 10:- (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ.2లక్షల విలువైన రెండు గేదెలు ఆదివారం మృతి చెందాయి. తడకమళ్ల గ్రామానికి చెందిన పేద రైతు, గీత కార్మికుడు శ్రీనివాస్ కు చెందిన 2 పాడిగేదెలు మేత కోసం పొలాల వెంట తిరుగుతున్న క్రమంలో గేదెలపై కరెంట్ తీగలు పడడంతో అక్కడికక్కడే చనిపోయాయి. వాటి విలువ సుమారు 2లక్షల రూపాయలుంటుందని బాధిత రైతు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రవినాయక్, నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన శ్రీనివాస్ కు అన్యాయం జరిగిందని వారు తెలిపారు. గీత కార్మికుడి జీవనాధారమైన రెండు పాడి గేదెలు చనిపోవడం విచారకరమని సదరు రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.



# హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు.....




**చందా నగర్ ప్రభాత సూర్య :** హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం పురస్కరించుకొని పలువురు మహిళ మాతృ మూర్తులకు ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా మహిళ మూర్తులకు శాలువాతో సన్మానించి స్వీట్ ప్యాకెట్లను అందచేశారు. మాతృ దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులను సన్మానించుకోవడం ఏంతో అనందంగా ఉందని కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజానాట్యమండలి మూడవ మహాసభను జయప్రదం చేయాలి

**తుర్కపల్లి, మే 10 ప్రభాతసూర్య :** తెలంగాణ ప్రజా నాట్యమండలి మూడవ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలో కళాకారులను నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీని త్యాగ జాను అధ్యక్షతన నిర్వహించారు .ఈ సందర్భంగా సిల్వేరు దుర్గయ్య మాట్లాడుతూ అర్హులైన కళాకారులకి పెన్షన్ ఇవ్వాలని ఐడెంటి కార్డులను ఇవ్వాలని కళాకారులకు హాస్పటల్లో ఉచిత వైద్యం ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి ఈనెల 20వ తేదీన ఆలేరులో జరిగే మూడో మహాసభ జయప్రదం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజా హేమలత శ్రీనివాస్, శ్యాగ మల్లేశం, గడిపే సత్యనారాయణ, శ్యాగ బాలరాజు, లింగయ్య ,శ్యామల, గడిపే వంశీ, గడిపే కృష్ణ ,గడిపే పోచమ్మ, పాల్గొన్నారు.

## సంస్కారాల సందడిలో మదర్స్ డే

### మాధాపూర్‌లో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాధాపూర్‌లోని స్మార్ట్ పర్ల్స్ ప్రీ స్కూల్‌లో ఆదివారం మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమ్మర్ క్యాంప్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు నృత్యాలు, పాటలు, వినోదాత్మక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా నిర్వహించిన పాదపూజ కార్యక్రమం తల్లిదండ్రులను భావోద్వేగానికి గురిచేసింది. పిల్లలు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు తీసుకోవడం అందరినీ కట్టిపడేసింది. భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు పిల్లలకు నేర్పించే ప్రయత్నం అభినందనీయమని తల్లిదండ్రులు ప్రశంసించారు. పల్లేరుమూడి సత్యవతి, పల్లేరుమూడి వరలక్ష్మి, అరుణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనర్ బాలిక పై బండి భగీరథ్ అత్యాచారం తో మోడీ భేటీ బచావో-బేటి.పడావో వట్టి బూటకం అని తేలిపోయింది..

### ఆర్.సీత,పీ ఓ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి



**ఆలేరు మే 10 ప్రభాత సూర్య... :** బీ జే పీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై,అమ్మాయిలపై, విద్యార్థినీలపై చివరికి మహిళా మల్ల యోధులపై బీ జే పీ ఎంపీ బ్రిజ్ భూషన్ సింగ్ లైంగిక వేధింపులు,అత్రాస్(ఉత్తరప్రదేశ్) లో దళిత బిడ్డపై అత్యాచారం,హత్య కోకొల్లలుగా జరిగాయని, అయినా మోడీ పదే పదే భేటీ బచావో గురించి అదే పనిగా మాట్లాడుతూనే ఉంటాడని,నేడు బీ జే పీ ఎంపీ,కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొడుకు బండి భగీరథ్ మైనర్ బాలికపై అత్యాచారం ఘటనతో మోడీ మాట్లాడుతున్న భేటీ బచావో,భేటీ పడావో అనే మాట వట్టి బూటకమని తేలిపోయిందని,మోడీ మాట్లాడే బచావో నిజమైతే బీ జే పీ,మంత్రి కొడుకు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీ ఓ డబ్ల్యూ)రాష్ట్ర కార్యదర్శి ఆర్.సీత డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీత మాట్లాడుతూ,బాలికలు చదవాలి,ఎదగాలి, ప్రయోజకులు కావాలని ఎవరైనా కోరుకుంటారని,కానీ మోడీ మాత్రం భేటీ బచావో, బేటి పడావో అనడంలో పెద్ద కుట్ర,మహిళలను ఈ నినాదం పేరుతో తప్పుదోవ పట్టించే అవకాశం ఉన్నదని,అందులో భాగమే మైనర్ బాలికలపై అత్యాచారాలు,హత్యలు అని అర్థం చేసుకోవాలని అన్నారు.మైనర్ బాలిక హిందూవే, రేపిస్టు హిందువే మరి హిందూ మతాచారాలు,సంస్కృతి, సాంప్రదాయాలు ఎటుపోయాయని ప్రశ్నించారు.బండి భగీరథ్ అత్యాచారం పై ప్రభుత్వం,చట్టం కఠినంగా వ్యవహరించాలని, శిక్షించాలని,మంత్రి కొడుకు అని,పలుకుబడి గలవాళ్ళనే పేరుతో ఉదారంగా వ్యవహరిస్తే మహిళా లోకం బగ్గుమంటుందని అన్నారు.

# విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి





- సమాజం నుండి మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి..
- ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి..
- క్రీడలు.. క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..
- పటాన్చెరులో ఘనంగా ప్రారంభమైన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు..
- లాంఛనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్
- వివిధ రాష్ట్రాల నుండి హాజరైన రెండు వేల మంది క్రీడాకారులు
- ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు..
- కృతజ్ఞతలు తెలిపిన క్రీడాకారులు.. తల్లిదండ్రులు..

**పటాన్చెరు, మే 10,ప్రభాత సూర్య :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత, శారీరక ధారుడ్యత కోసం విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని.. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారత రత్న పివి నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సౌజన్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10 జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో కరాటే పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది క్రీడాకారులు టోర్నమెంట్ కు హాజరు కావడం పటాన్చెరు నియోజకవర్గం యొక్క ఖ్యాతిని నలుదిశలా చాటి చెప్పినట్లు అయ్యిందని అన్నారు. చిన్ననాటి నుండి తనకు క్రీడలు అంటే ఎంతో మక్కువ అని, నియోజకవర్గ స్థాయిలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతోపాటు.. ఏడాది పొడవునా వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని. సమాజం నుండి వాటిని తరిమి కొట్టడంలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుండి పిల్లలకు వాటి దుష్పరిమానాలను వివరించాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల పైన ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. క్రీడాకారులకు ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించాలని కోరారు. కరాటే పోటీల నిర్వహణ కోసం ఎమ్మెల్యే జీఎంఆర్ 5 లక్షల రూపాయల సొంత నిధులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, దశరథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామచంద్ర రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, షకీల్, టోర్నమెంట్ నిర్వాహకులు రాజు యాదవ్, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ మాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాతృత్వానికి మానవీయ మద్దతు

### బాలింతలు, చిన్నారులకు బేబీ కిట్ల పంపిణీ.. నాలుగేళ్లుగా మాతృదినోత్సవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్






**పటాన్చెరు, మే 10,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు పట్టణంలోని ఎండీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో ప్రపంచ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. మాతృత్వపు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించిన తల్లులు, వారి చిన్నారులకు బేబీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్, ఆయన తల్లి మాద్రి తులసి లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ అమ్మ ప్రేమకు ప్రపంచంలో ఎలాంటి ప్రత్యామ్నాయం లేదన్నారు. తల్లులు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజ నిర్మాణానికి కూడా మూలస్తంభాలని పేర్కొన్నారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా, గౌరవంగా జీవించే సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని తెలిపారు. మహిళలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం ఎండీఆర్ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. మాతృదినోత్సవం సందర్భంగా ప్రతి తల్లికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాద్రి తులసి లక్ష్మి మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఎండీఆర్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళా సాధికారత, బాలల సంక్షేమ రంగాల్లో ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని సంపాదించాయని పేర్కొన్నారు. అవసరమైన వర్గాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని తెలిపారు. గత నాలుగేళ్లుగా మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, బాలింతల సంక్షేమం కోసం ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపారు.

# శారాజీపేటలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఆలేరు మే 10 ప్రభాత సూర్య :**20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి చేరిన స్నేహితులు యాదాద్రి భువనగిరి (శారాజీపేట) గత కాలపు తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, చదువుకున్న బడిని, నేర్పిన గురువులను గౌరవించుకుంటూ ఆలేరు మండలంలోని శారాజీపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రామీ) ఆవరణలో 2005-2006 నాటి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. “మళ్ళీ బడికి పోదాం - 2026” అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యాకుసుమాల కలయికతో సందడిగా మారింది.

**గురుపూజోత్సవం:**

ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా అప్పటి ఉపాధ్యాయులు పోరెడ్డి రంగయ్య, ఉమాదేవి, ప్రభాకర్ రెడ్డి, కిష్టయ్య, నాగేందర్, జంగయ్య, మరియు సంధ్య రాణి గారు విచ్చేశారు. విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 20 ఏళ్ల తర్వాత కూడా విద్యార్థులందరూ ఐక్యంగా ఒకే చోట చేరడం, పాఠశాల పట్ల గౌరవం కలిగి ఉండటం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు.



**జ్ఞాపకాల పందిరి:**

సుమారు రెండు దశాబ్దాల క్రితం పాఠశాల విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు, నేడు వివిధ రంగాల్లో స్థిరపడి, మళ్ళీ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. పాత జ్ఞాపకాలను పంచుకుంటూ, ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో 2005-2006 బ్యాచ్‌కు చెందిన అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

**తేదీ:** 10.05.2026

**స్థలం:** శారాజీపేట.